సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

90324 97123

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి సహస్ర తులసిపూజ



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రనవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు మీసాల అశోక్‌కుమార్, బి. అనురాధ, ఎస్. సతీష్, ఎస్‌ఎస్‌ఎస్ సుబ్రహ్మణ్యం, ఎస్. సురేష్, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

అప్రమత్తతతోనే బ్రెస్ట్ క్యాన్సర్ దూరం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శృతి

దాబాగార్డెన్స్ : బ్రెస్ట్ క్యాన్సర్ ప్రాణాంతకం కానప్పటికీ ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడవచ్చని లాజరస్ ఆస్పత్రి వైద్య నిపుణురాలు డాక్టర్ శృతి అన్నారు. గురువారం ఏవీఎన్ కళాశాలలో నిర్వహించిన బ్రెస్ట్ క్యాన్సర్ పరీక్షల్లో ఆమె పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రినాయుడు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కళాశాల వుమెన్ అసోసియేషన్ వింగ్ అధ్యక్షురాలు ఎం. స్వరాజ్యలక్ష్మి, కార్యదర్శి కృష్ణకుమారి, కళాశాల ఇంగ్లీషు విభాగాధిపతి పైడి రజని, కోశాధికారి మల్లిక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

16న ఎరుకుమాంబ దేవాలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం వార్షిక మహోత్సవం ఈనెల 16వ తేదీన అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రమాబాయి తెలిపారు. ఉదయం 6 గంటలకు విఘ్నేశ్వర పూజ, అమ్మవారి ప్రాతఃకాల అర్చనలు, పంచామృతాభిషేకం, 8 గంటల నుంచి శ్రీలక్ష్మీ గణపతి హోమం, అన్నకుంభరాశి పూజలు, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందన్నారు.

ధమ్మచక్ర మహోత్సవం రేపు

సీతంపేట: రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో ఈ నెల 14న నిర్వహించనున్న 67వ ధమ్మచక్ర మహోత్సవాన్ని జయప్రదం చేయాలని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు బొడ్డు కల్యాణరావు, జె.వి.ప్రభాకర్ కోరారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1956 అక్టోబర్ 14న డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లక్షలాది మందితో కలిసి బౌద్ధాన్ని స్వీకరించారన్నారు. నాటి నుంచి ప్రతి ఏటా ధమ్మచక్ర మహోత్సవం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిష్ణాతులైన బౌద్ధులు, ఉపాసకులు పాల్గొంటారని చెప్పారు.

మహర్దశ



అబుసారంగ వీధిలో జరుగుతున్న కాలువల నిర్మాణం



పోలీసు స్టేషన్ పక్కనున్న రహదారి విస్తరణ పనుల దృశ్యం

గత పాలకులు వదిలేసిన పాతనగరం అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నడుం బిగించారు. ఈ ప్రాంతంలోని రహదారులు, సామాజిక భవనాలు, షాదీఖానాలు, కాలువలను అభివృద్ధి చేస్తూ ప్రజల మన్ననలు అందుకుంటున్నారు. ఇక్కడి అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోని నాటి పాలకులకు ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి కనువిప్పు కలిగిస్తుందని స్థానిక నేతలు, ప్రజలు అంటున్నారు.

- 39వ వార్డులో జోరుగా అభివృద్ధి పనులు
- 20 ఏళ్ల తర్వాత మారుతున్న రూపురేఖలు
- హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు

జగదాంబ : జీవీఎంసీ 39వ వార్డుకి మహర్దశ పట్టనుంది. ఇరవై ఏళ్ల తర్వాత ఈ ప్రాంతంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వార్డులో అబుసారంగ వీధి, కోటవీధి, చాగంటి వారివీధి, మౌలాలీ పంజా వీధి, థామ్సన్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లగా శిథిలమై మురుగుతో నిండిపోయిన కాలువలను రూ. 40 లక్షలతో పునర్నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో పాతనగరం మరింత పాతబడిపోయింది. ఇక్కడి అనేక రహదారులు, కాలువలు శిథిలమై ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అభివృద్ధికి బాటలు వేస్తోంది. నగరంలోని అన్ని వార్డులను సమదృష్టితో అభివృద్ధి చేస్తోంది. ఇటీవలే రూ. 2 కోట్లు వెచ్చించి షాదీఖానాకు అదనపు వసతులు ఏర్పాటు చేసి ప్రజల అందుబాటులోకి తీసుకు వచ్చింది. అలాగే పలుచోట్ల చేపట్టిన నూతన రహదారుల నిర్మాణం కూడా దాదాపు పూర్తి కావస్తోంది. దీంతో పాటు ఇప్పుడు వార్డులో కాలువలు నిర్మించి అభివృద్ధికి బాటలు వేస్తున్న జగనన్న ప్రభుత్వం పనితీరు పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పుడే అభివృద్ధి జరుగుతోంది..



ఎన్నో సంవత్సరాలుగా పాతనగరం అభివృద్ధికి దూరంగా ఉండిపోయింది. వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం వచ్చాకే ఈ ప్రాంతం రూపురేఖలు మారుతున్నాయి. రహదారులు, కాలవలు, వీధిలైట్లు, సామాజిక భవనాలు ఇలా ఎన్నో ఈ ప్రాంత ప్రజలకు సమకూరుతున్నాయి.

మైలపల్లి రాజు, 39వ వార్డు

గత పాలకులకు కనువిప్పు



ముఖ్యమంత్రి జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం అవుతుంది. కులమతాలు, పార్టీలకు అతీతంగా ఆయన అన్ని ప్రాంతాలను ఒకేలా అభివృద్ధి చేస్తున్నారు. వెనుకటి రోజుల్లో పాతనగరం వైపు కన్నెత్తి చూడని నాయకులందరికీ ఇప్పుడు జరుగుతున్న అభివృద్ధి కనువిప్పు కలిగిస్తుంది.

మహ్మద్ సాధిక్, 39వ వార్డు కార్పొరేటర్

ప్రజారోగ్యమే లక్ష్యంగా జగనన్న సురక్ష



వేంకటేశ్వరమెట్టపై ఇంటింటి ప్రచారంలో కర్రి నీలకంఠం, బొడ్డేటి ప్రసాద్



కుమ్మరవీధిలో స్థానికులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

అల్లిపురం : రాష్ట్ర ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపొందించారని క్లస్టర్ మండల అధ్యక్షుడు కర్రి నీలకంఠం అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన పార్టీ పార్లమెంటరీ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్‌తో కలిసి 33వ వార్డు వేంకటేశ్వరమెట్ట–1 సచివాయం పరిధిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో కుటుంబ సభ్యులందరూ బీపీ, షుగర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. వారికి ఇంకా ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే నమోదు చేసుకుంటారని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది ఇచ్చే టోకెన్‌తో త్వరలోనే శిబిరంలో పాల్గొని తగిన పరీక్షలు చేయించి, మందులతో పాటు అవసరమైతే వైద్యం కూడా అందజేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్ కిరణ్, సూపర్‌వైజర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరవీధి సచివాలయం పరిధిలో..

వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో కుమ్మరవీధి సచివాలయం పరిధిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. రాష్ట్ర ప్రజలు ఆరోగ్యంగా ఉండాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చేపట్టారన్నారు. అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, ఆడారి వెంకట మహేష్, భీశెట్టి రాజు, ఏఎన్‌ఎం తులసి, నర్సింగ్ విద్యార్థులు, మంగవేణి, వరలక్ష్మి, వలంటీర్లు దేవి, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు ఖాకీ చొక్కాల పంపిణీ



ఆటో కార్మికులకు చొక్కాలు అందజేస్తున్న కార్పొరేటర్ జానకీరామ్

దాబాగార్డెన్స్ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీతంరాజు సుధాకర్ సహకారంతో 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ నేతృత్వంలో వార్డు పరిధిలో గల ఆటో కార్మికులకు ఖాకీ చొక్కాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి ఆకుల యేసు, రెయ్యి డేవిడ్‌రాజు, మత్స్యకార నాయకుడు కాసారపు వాసు, మహిళా అధ్యక్షురాలు సత్యవతి, కన్వీనర్లు నిమ్మకాయల ఆదిలక్ష్మి, ఆరిక దైవకుమార్, ఆనంద్, డాక్టర్ రమణ, శేఖర్, రోజా, రమణితో పాటు గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కనీస వేతనం రూ. 26 వేలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్రావు

దాబాగార్డెన్స్ : కేజీహెచ్, ఈఎన్‌టీ, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి, మానసిక వైద్యశాల, టీబీ హెచ్, రాణి చంద్రమతి, విమ్స్ తదితర చోట్ల పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చేయాలని సిటు డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం జగదాంబ జంక్షన్ సమీపాన గల సిటు కార్యాలయంలో విశాఖ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రుల కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు పి. వెంకట్రావు, సిటు కార్యదర్శి పి. మణి, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు బి. పద్మ, ప్రధాన కార్యదర్శి వై. సత్యవతి, వివిధ ఆస్పత్రుల యూనియన్ నాయకులు పాల్గొన్నారు. కాంట్రాక్ట్ విధానం వల్ల ప్రతి నెలా వీరికి జీతాలు అందడం లేదన్నారు. పిల్లల చదువులతో పాటు కుటుంబ పోషణకు అప్పులు చేయాల్సి వస్తోందని, ప్రతినెలా 5వ తేదీలోగా జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్‌కు సిల్వర్ మెడల్



లక్ష్మీపల్లవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి, ఎన్‌సీసీ అధికారి గీతాంజలి

దాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల సెకండియర్ బీఏ విద్యార్థిని సీహెచ్ లక్ష్మీ పల్లవి జాతీయ స్థాయిలో సిల్వర్ మెడల్ సాధించింది. గత నెల 18 నుంచి 30 వరకు ఢిల్లీలో నిర్వహించిన ఎన్‌సీసీ జాతీయ క్యాంపులో భాగంగా ఆలిండియా సైకిల్ పోటీలో లక్ష్మీ పల్లవి ఈ పతకం సాధించింది. ఈ మేరకు గురువారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. శోభారాణి లక్ష్మీపల్లవిని అభినందించారు. జాతీయ స్థాయి క్యాంపుల్లో విద్యార్థినులు పాల్గొనడం వల్ల క్రమశిక్షణ, సమైక్యతతో పాటు మనోధైర్యం పెంపొందుతాయన్నారు. కళాశాల ఎన్‌సీసీ అధికారి డాక్టర్ కె. గీతాంజలి మాట్లాడుతూ విద్యార్థుల్లో జాతీయ భావాన్ని పెంపొందించడంలో ఎన్‌సీసీ క్యాంపులు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

పరిశోధన రంగంలో రాణించాలి



విద్యార్థులకు పట్టాలు అందజేస్తున్న అశోక్‌కుమార్ తదితరులు

- నూతన ఔషధాలను అన్వేషించాలి
- ఘనంగా ఫార్మా–డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు

ఏయూక్యాంపస్ : ఫార్మా–డీ కోర్సు పూర్తి చేసిన విద్యార్థులు పరిశోధన రంగంలో రాణించాలని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్ కుమార్ కోరారు. గురువారం ఏయూ వైవీఎస్ మూర్తి ఆడిటోరియంలో నిర్వహించిన ఫార్మా–డీ విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అశోక్ కుమార్ మాట్లాడుతూ నూతన ఔషధాలు, మూలకాల అన్వేషణ జరిపే దిశగా కృషి చేయాలని సూచించారు. వైద్యులతో అనుసంధానంగా పనిచేయాలన్నారు. ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన తరువాత సమాజానికి మనం ఏ విధంగా ఉపయోగపడగలం అనే ఆలోచన కలిగి ఉండాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వై.రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ వైద్యునికి, రోగికి మధ్య అనుసంధానంగా ఫార్మా–డీ విద్యార్థులు నిలుస్తారన్నారు. ఔషధాలకు సంబంధించిన చట్టాలపై ఏపీ డ్రగ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.విజయ్ కుమార్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆచార్య జి.శశిభూషణ రావు, ఆచార్య కేవీ రమణ మూర్తి, ఆచార్య జి.గిరిజా శంకర్, వి.గిరిజా శాస్త్రి, కె.ఈశ్వరకుమార్, ఏకేఎం పవార్, శైలజ పాల్గొన్నారు.

బీవీకేలో దసరా వేడుకలు

ఆరిలోవ: విశాలాక్షినగర్ బీవీకే పాఠశాలలో గురువారం దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇక్కడ బొమ్మల కొలువు ఏర్పాటు చేసి దుర్గాదేవి పూజ చేశారు. అనంతరం విద్యార్థులు వివిధ వేషధారణలో దుస్తులు ధరించి ఆకట్టుకున్నారు.

మందుల వినియోగంపై కేంద్ర కమిటీ ఆరా

తగరపువలస: భీమిలి మండలం టి.నగరపాలెం పంచాయతీలో గురువారం ఇద్దరు వైద్యులతో కూడిన కేంద్ర పబ్లిక్ రిలేషన్స్ కమిటీ పర్యటించింది. కేరళకు చెందిన వైద్యులు సజిత, అనితకుమారి ఈ బృందంలో ఉన్నారు. వీరు పంచాయతీలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది ఎలాంటి మందులు ఇస్తున్నారు, ఏ పరీక్షలు చేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. తర్వాత పంచాయతీలోని ప్రజలతో వైద్య చికిత్సల గురించి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వినియోగిస్తున్న మందుల గురించి ఆరా తీశారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ జీవనరాణి, తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు, సర్పంచ్ పొట్నూరు ఛాయాగౌతమి పాల్గొన్నారు.

మహారాజా బ్యాంక్‌కు ప్రతిష్టాత్మక అవార్డులు



అవార్డు అందుకుంటున్న మహారాజా బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు రామకృష్ణంరాజు

సీతమ్మధార: ది మహారాజా కో–ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ జాతీయ స్థాయిలో రెండు ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నట్లు బ్యాంక్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కో ఆపరేటివ్ బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన వ్యాపార పోటీల్లో ×ఫ్రంటియర్స్ ఇన్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్–2023, బ్యాంకో బ్లూ రిబ్బన్–2023 అవార్డులను గెలుపొందినట్లు తెలిపారు. ఈ నెల 12న గోవా వేదికగా బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ వారు నిర్వహించిన నేషనల్ కో ఆపరేటివ్ బ్యాకింగ్ సమ్మిట్, ఫ్రంటియర్స్ ఇన్ కో ఆపరేటివ్ బ్యాంకింగ్ అవార్డుల ప్రదాన కార్యక్రమంలో బెస్ట్ కేవైసీ ఇనిషియేటివ్ కేటగిరీలో అవార్డు సాధించారు. గోవా ప్రభుత్వం ఆధ్వర్యంలో సహకార శాఖ మంత్రి సుభాష్ శిరోద్కర్, బ్యాంకింగ్ ఫ్రంటియర్స్ గ్రూప్ ప్రెసిడెంట్ బాబునాయర్ చేతులు మీదుగా మహారాజా బ్యాంకు వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.రామకృష్ణంరాజు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎం.మురళీకృష్ణ వర్మ అవార్డు అందుకున్నారు. రూ.225 కోట్ల నుంచి రూ.250 కోట్ల డిపాజిట్ కేటగిరిలో జాతీయ స్థాయిలో రెండో స్థానం సాధించినట్లు రామకృష్ణంరాజు వెల్లడించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి ఔదార్యం



కోడిపందాల వీధికి చెందిన బండి శంకర్రావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



35వ వార్డులో నక్కబోయిన అప్పారావుకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్ : ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం పలు వార్డుల్లో ఆరుగురు బాధితులకు రూ.30 వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 35వ వార్డులో పక్షవాతంతో బాధపడుతున్న కల్లుపాకలకు చెందిన మహేంద్రాల వీర సత్తిరాజుకు మందుల కొనుగోలుకు రూ.5 వేలు, ఇదే ప్రాంతానికి చెందిన నక్కబోయిన అప్పారావుకు రూ.5 వేలు, 30వ వార్డు కోడిపందాల వీధికి చెందిన కిడ్నీ రోగి బండి శంకర్రావుకు రూ.5 వేలు అందజేశారు. ఇదే వార్డు సాలిపేట రజకవీధికి చెందిన టేకు లక్ష్మీ క్యాన్సర్‌తో ఇటీవల చనిపోయిన కారణంగా దశదిన కర్మకు రూ.5 వేలు అందజేయడంతో పాటు పిల్లలకు ఉద్యోగావకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. 33వ వార్డు గౌరీ స్ట్రీట్‌కు చెందిన క్యాన్సర్‌తో బాధపడుతున్న పితాని మరియ మందుల కొనుగోలుకు రూ.5 వేలు అందజేస్తూ పిల్లలను వైజాగ్ డిఫెన్స్ అకాడమీలో ఇంటర్మీడియట్ ఉచితంగా చదివిస్తానని హామీ ఇచ్చారు. 30వ వార్డు కేజీహెచ్ వార్డుబాయికాలనీలో ఉంటున్న వడ్డాది మేరీ ప్రసవ సమయంలో పుట్టిన బేబీతో పాటు చనిపోవడంతో పెద్దకర్మకు ఆమె కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ఆయా వార్డుల కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, జేసీస్ ప్రెసిడెంట్స్, ఇన్‌చార్జిలు, స్టేట్ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

అలరించిన భజనలు.. కీర్తనలు



కీర్తనలు ఆలపిస్తున్న మహిళా భక్త బృందం సభ్యులు

దాబాగార్డెన్స్ : గురువారం ఉదయం నగరంలోని ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో భజనలు, కీర్తనలు ఆలపించారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా జరిగిన ఈ కార్యక్రమంలో తగరపువలసకు చెందిన సింహశైల సేవా సంఘం ప్రతినిధి ఎస్. హరిలక్ష్మి ఆధ్వర్యంలో చింతామణి గణపతి భజన మండలి సభ్యులు పి. రత్నమాల, శ్రీమన్నారాయణ, అన్నమయ్య సంకీర్తన బృందం సభ్యురాలు పి. నాగలక్ష్మి, సరిగమ అకాడమీ ప్రతినిధి ఎం. శ్రీదేవి మహిళా భక్త బృందం సభ్యులు ఆలపించిన విష్ణు కీర్తనలు, భజనలు భక్తులను అలరించాయి. మరో మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. కార్యక్రమం అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికులకు న్యాయం చేయాలి



బాణాల శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్ : రైవాడ కెనాల్‌లో నీటిలో పని చేస్తున్న 105 మంది అన్‌స్కిల్డ్ వర్కర్లకు రూ.15 నుంచి రూ.18,500కి జీతం పెంచాలని, అన్‌స్కిల్డ్‌గా పనిచేస్తూ పదేళ్ల అనుభవం ఉండి, ఐటీఐ సర్టిఫికెట్ కలిగిన 119 మందికి కూడా రూ.15 వేల నుంచి రూ.18,500కి జీతం పెంచేలా కౌన్సిల్‌లో ఆమోదం తెలిపి ప్రభుత్వానికి పంపాలని జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యం విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావును వారి చాంబర్లలో కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉత్సాహంగా యువజనోత్సవాలు



ముఖ్య అతిథి డాక్టర్ ఉమా మూర్తితో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



సాంస్కృతిక పోటీల్లో విద్యార్థినుల ప్రదర్శన

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ నేతృత్వంలో ఎక్సెల్సియార్–23 యువజనోత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా యూకే నుంచి విచ్చేసిన ప్రముఖ గైనకాలజిస్ట్, కళాశాల పూర్వ విద్యార్థిని డాక్టర్ ఉమా మూర్తి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించి మాట్లాడారు. మహిళలు ఏ దేశంలో అయినా, ఏ రంగంలో అయినా ముందుంటారన్నారు. మహిళా సాధికారత కోసం కళాశాల చేస్తున్న కృషిని అభినందించారు. నృత్యం, సంగీతం, చిత్రలేఖనం, ఫొటోగ్రఫీ, ముకాభినయం, నాటకం, ఏకపాత్రాభియ పోటీలలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ప్రతిభ కనబరిచారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు శుక్రవారం జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు ప్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ పీకే జయలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో ప్రొగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ టి.భాస్కరసుధ, సిస్టర్ మేరీ, నాన్సీ, డాక్టర్ మాణిక్యకుమారి, హరిణి, సోనీ, పవన్, డాక్టర్ లక్ష్మీప్రభ, ప్రమీల, కౌన్సిల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విస్తరణతో మారిన రూపురేఖలు



వన్‌టౌన్ రహదారి (నాడు)



రహదారి విస్తరణ తర్వాత వన్ టౌన్ రహదారి (నేడు)

జగదాంబ : వన్‌టౌన్ రహదారి విస్తరణ తర్వాత ఈ ప్రాంతం రూపురేఖలు మారిపోయాయి. జగదాంబ నుంచి చూస్తే పాతనగరం కనిపించాలనే ప్రజల కోరికకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీజం వేసింది. ఏళ్ల నాటి కల నాలుగేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం నేరవేర్చింది. విస్తరణ పనులు దాదాపు పూర్తి అయ్యాయి. వ్యాపారులు కూడా సహకరించడంతో దుకాణాలు వెనక్కి వెళ్లాయి. దీంతో వాహన చోదకులు, పాదచారులకు రహదారి అనుకూలంగా మారుతోంది. ప్రస్తుతం కాలువల నిర్మాణం జరుగుతోంది.